క్లుప్తంగా

వలంటీర్ల సేవలు అభినందనీయం



పట్నంబజారు: రాష్ట్రంలో ప్రతి గడపకూ సంక్షేమ పథకాలు అందిస్తూ, ప్రతి ఒక్కరికీ చేరువతున్న వలంటీర్లు అభినందనీయులని తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫా కొనియాడారు. నియోజకవర్గంలోని తారకరామానగర్‌లో సోమవారం 57వ డివిజన్ వలంటీర్లకు అభినందన, అవార్డుల ప్రదానం చేశారు. దుశ్శాలువా, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముస్తఫా మాట్లాడుతూ ప్రజలు, ప్రభుత్వానికి మధ్య వలంటీర్లు వారధుల్లా పని చేస్తున్నారని తెలిపారు. అర్హులైన ప్రతి పేదవాడిని గుర్తించి పథకాలు అందజేస్తూ వలంటీర్లు చేస్తున్న సేవలు ప్రశంసనీయమన్నారు. వలంటీర్ వ్యవస్థ ద్వారా కరోనా వంటి విపత్కర సమయంలో పేదలకు సంక్షేమం అందించిన దాత రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో 57వ డివిజన్ కార్పొరేటర్ పఠాన్ రిహానా, వైఎస్సార్ సీపీ నేతలు నూర్‌ఖాన్, ప్రకాష్, చిరంజీవి, కన్నబాబు, రాజారావు, మహాలక్ష్మి, హిమబిందు, పలు సచివాలయాల అడ్మిన్లు, వైఎస్సార్ సీపీ నేతలు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీవారి బ్రహ్మోత్సవాలు



పాత గుంటూరు: లాలాపేటలోని శ్రీ వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా సోమవారం వసంతోత్సవం, చక్ర స్నానం, పూర్ణాహుతి, ధ్వజావరోహణ, మూగబలి కార్యక్రమాల్ని నిర్వహించారు. దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ డి. శ్రీనివాసరావు, చైర్మన్ పిచ్చుల జయప్రకాష్‌రెడ్డి, అర్చకులు ప్రసాద్, మురళీ చంద్ర కుమార్, శ్రీనివాసాచార్యులు పర్యవేక్షించారు. కార్యక్రమంలో ధర్మకర్తల మండలి సభ్యులు విశాలాక్షి, వెంకట జ్యోతి, నరేష్ కుమార్, రామకోటేశ్వరరావు, వెంకటరత్నం, శ్రీనివాసులు, అనిత, శివకుమారి పాల్గొన్నారు.

అయ్యప్ప ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు



పాత గుంటూరు: మల్లారెడ్డి నగర్ శ్రీ విఘ్నేశ్వర, కుమారస్వామి సహిత శ్రీ ధర్మ శాస్త అయ్యప్పస్వామి, శ్రీ విద్యా సరస్వతి, శ్రీ పర్వత వర్ధిని సమేత శ్రీ రామలింగేశ్వర స్వామి దేవస్థానం వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. ఈ సంర్భంగా సోమవారం వేద మంత్రాల నడుమ ఉదయం రుద్ర హోమం, శ్రీ రామలింగేశ్వర స్వామికి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, సాయంత్రం మృత్యుంజయ హోమం, శివ సహస్రనామార్చన భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమాల్ని అయ్యప్ప ఫౌండేషన్ చైర్మన్ మెట్టు కృష్ణారెడ్డి, పాలకవర్గం పర్యవేక్షించారు.

కన్నుల పండువగా శ్రీవారి రథోత్సవం



పాత గుంటూరు: ఎస్వీఎస్ కాలనీలోని శ్రీ పద్మావతి గోదా సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో 21వ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. సోమవారం ఉదయం విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, అగ్ని ధ్యానం, నవగ్రహారాధన, నిత్య హోమం తదితర కార్యక్రమాలు బృందావనం ప్రసాదాచార్యుల ఆధ్వర్యంలో జరిగాయి. సాయంత్రం శ్రీవారి రథోత్సవం అత్యంత వైభవంగా పురవీధుల్లో సాగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా 42వ డివిజన్ కార్పొరేటర్ వేములపల్లి శ్రీ రాంప్రసాద్ పాల్గొని రథోత్సవం ప్రారంభించారు. ఆలయ అధ్యక్షుడు పావులూరి కిశోర్, కార్యదర్శి నల్లమోతు వెంకట రత్తయ్య, కోశాధికారి పుచ్చ వెంకట మల్లేశ్వర్, పాలకవర్గం సభ్యులు పర్యవేక్షించారు.

నగరంలో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం

మేయర్ కావటి, ఎమ్మెల్యే గిరిధర్

నెహ్రూనగర్: నగరంలో మౌలిక వసతుల కల్పనకు పాలకవర్గం అధిక ప్రాధాన్యతనిస్తోందని, పార్టీలకతీతంగా నగర సమగ్రాభివృద్ధికి కట్టుబడి ఉన్నామని నగర మేయర్ కావటి శివ నాగ మనోహర్ నాయుడు తెలిపారు. విద్యానగర్ 2వ లైన్‌లో సోమవారం రూ. 75 లక్షలతో సీసీ రోడ్డు, డ్రెయిన్లు, కల్వర్ట్ నిర్మాణానికి పశ్చిమ ఎమ్మెల్యే మద్దాలి గిరిధర్‌తో కలసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ రాష్ట్రంలో ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాల్ని కుల, మత, పార్టీలకతీతంగా అందజేస్తున్నారని, వారిని ఆదర్శంగా తీసుకొని గుంటూరు నగరంలో అభివృద్ధి పనుల్ని పారదర్శకంగా చేస్తున్నట్లు చెప్పారు. ప్రాధాన్యతాక్రమంలో ప్రతి డివిజన్ అభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. స్థానిక ప్రజాప్రతినిధులు వారి డివిజన్లలో గుర్తించిన సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. పనుల్ని నాణ్యతా ప్రమాణాలతో పాటు నిర్దేశిత గడువు మేరకు కాంట్రాక్టర్లు పూర్తి చేసేలా ఇంజినీరింగ్ అధికారులు పర్యవేక్షణ చేయాలని సూచించారు. ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో అభివృద్ధి పేరుతో గుంటూరుని గుంటలూరుగా మార్చారని చెప్పారు. జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయ్యాక జరిగిన ఎన్నికల్లో ఏర్పడిన గుంటూరు నగరపాలక సంస్థ పాలకవర్గం నగరంలో అభివృద్ధి పనుల్ని విరివిగా చేపట్టిందన్నారు. వాటిని కూడా కుల మత పార్టీలకతీతంగా నిర్వహిస్తున్నామని వివరించారు. కార్యక్రమంలో డీఈఈ రఫీక్, వైఎస్సార్ సీపీ నాయకులు కరుణాకరరెడ్డి, వెంకటేశ్వర్లు నాయక్, శ్రీను నాయక్, గుదిబండ వెంకటేశ్వరరెడ్డి, కృష్ణ, పులగం శ్రీనివాసరెడ్డి, దేవిశెట్టి ప్రసాద్, రోసిరెడ్డి, సచివాలయాల కార్యదర్శులు పాల్గొన్నారు.



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న మేయర్ కావటి, ఎమ్మెల్యే గిరిధర్

బాబూ.. నిన్నూ,నీ మేనిఫెస్టోలను ప్రజలు నమ్మరు

రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ మందపాటి శేషగిరిరావు

గుంటూరు ఎడ్యుకేషన్: అధికారం చేజిక్కించుకునేందుకు చంద్రబాబు ఎన్ని గిమ్మిక్కులైనా చేస్తారని రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ మందపాటి శేషగిరిరావు అన్నారు. ఆయన సోమవారం గుంటూరులోని క్యాంపు కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడారు. చంద్రబాబును, ఆయన ప్రకటించే మేనిఫెస్టోలను నమ్మేందుకు రాష్ట్ర ప్రజలు సిద్ధంగా లేరని, నిన్ను నమ్మం బాబూ అంటూ ముక్త కంఠంతో చెబుతున్నారని పేర్కొన్నారు. అధికారం లేకపోతే బాబు భరించలేరని, దాని కోసం ఎన్ని అబద్ధాలు ఆడేందుకైనా సరే వెనుకాడబోరని ఎద్దేవా చేశారు. 40 ఏళ్ల రాజకీయ అనుభవంలో 14 ఏళ్లు సీఎం పదవిని వెలగబెట్టిన చంద్రబాబు తన పేరు చెబితే గుర్తుకు వచ్చే విధంగా ఏ ఒక్క పథకం, అభివృద్ధి కార్యక్రమం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌తో పాటు విభజిత ఏపీలో లేదని స్పష్టం చేశారు. 2014లో మేనిఫెస్టో ద్వారా ప్రజలకు ఇచ్చిన 600 హామీల్లో ఒక్కదానిని సైతం సరిగ్గా అమలు చేయడం చేతకాని బాబును ప్రజలు నమ్మడం లేదని తెలిపారు. అధికారమే పరమావధిగా ఎవరితోనైనా పొత్తు పెట్టుకోడానికి, ఏ గడ్డి తినడానికైనా వెనుకాడని నైజం ఆయనదని పేర్కొన్నారు. ఎన్టీఆర్ నుంచి బలవంతంగా పార్టీని లాక్కున్న దగ్గర నుంచి తన మీద తనకు నమ్మకం లేక పక్క పార్టీల మీద ఆధారపడి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు 2019లో మొట్టమొదటిసారిగా సింగిల్‌గా పోటీ చేసి చరిత్రలో ఎవరు ఓడిపోలేనంత దారుణంగా ఘోరంగా ఓటమిపాలయ్యారని చెప్పారు. దాన్ని బట్టి చంద్రబాబు సత్తా ఏంటో ఆంధ్రప్రదేశ్ ప్రజలు స్వయంగా చూశారన్నారు. మోసపూరిత అబద్ధపు మేనిఫెస్టో హడావుడి తప్పా ఎప్పుడు మేనిఫెస్టోను అమలు చేసినట్లు చంద్రబాబు చరిత్రలో లేదని విమర్శించారు. రాష్ట్ర ప్రజల ఆశీర్వాదంతో అఖండ మెజార్టీతో అధికార పగ్గాలు నాటి నుంచి సీఎం వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు ఇచ్చిన హామీల్ని నెరవేర్చినందునే మళ్లీ ఎన్నికల్లో ధైర్యంగా 175 కి 175 సీట్లు గెలవగలమని గర్వంగా చెబుతున్నారని వివరించారు. ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తూ 75 ఏళ్ల స్వతంత్ర భారతదేశంలో అంబేడ్కర్ ఆలోచన విధానాన్ని అమలు చేసిన ఏకైక సీఎంగా వై.ఎస్. జగన్ చరిత్రలో శాశ్వతంగా మంచి ముఖ్యమంత్రిగా మిగిలిపోతారని చెప్పారు. పేదరిక నిర్మూలనకు చదువే సరైన వైద్యం అని నమ్మి బడుగు, బలహీనవర్గాలకు విద్యారంగంలో ప్రాధాన్యత ఇస్తూ విజయవంతమైన ఫలితాలను సాధించడమే ఇందుకు నిదర్శనమని పేర్కొన్నారు. రాజధానిలో పేదలకు 50,793 ఇళ్ల పట్టాలు పంపిణీ చేసిన ఘనత ఒక్క వై.ఎస్. జగన్‌కే దక్కుతుందని, చరిత్రలో ఎవరు చేయలేనంతగా 34 లక్షల కుటుంబాలకు ఇంటి స్థలాల్ని కేటాయించడం దేశంలోనే ప్రథమమని తెలిపారు.

ఏపీపీగా సుకుమార్ బాధ్యతల స్వీకరణ



సుకుమార్‌ను సన్మానిస్తున్న పాతూరి మధుసూదనరావు

గుంటూరు లీగల్: నాలుగో అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఏపీపీగా సుద్దపల్లి సుకుమార్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల జరిగిన బదిలీల్లో ఆయన గూడూరు నుంచి బదిలీపై ఇక్కడ నియమితులయ్యారు.నాలుగో కోర్టు ఇంచార్జి ఏపీపీ శౌరి నుంచి బాధ్యతలు స్వీకరించారు. ప్రాసిక్యూషన్ డెప్యూటీ డైరెక్టర్ పాతూరి మధుసూదనరావు, స్పెషల్ మొబైల్ కోర్టు ఏపీపీ శౌరి, జీబీఏ మాజీ వైస్ ప్రెసిడెంట్ ఉప్పులూరి శరత్, సురేష్, కోటయ్య, కిశోర్‌బాబు తదితరులు సుకుమార్‌కు శాలువా కప్పి సత్కరించారు.

పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత



మొక్కలు నాటుతున్న డాక్టర్ శ్రావణ్‌బాబు, డాక్టర్ సుబ్బరాజు



ప్లాస్టిక్ అనర్థాలపై ప్రదర్శన నిర్వహిస్తున్న కళాజాత బృందం

డీఎంహెచ్‌వో అమర్తలూరి శ్రావణ్‌బాబు

గుంటూరు మెడికల్: ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని గుంటూరు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ అమర్తలూరి శ్రావణ్ బాబు ఆధ్వర్యంలో సోమవారం ర్యాలీ నిర్వహించారు. వైద్యులు, వైద్య సిబ్బందితో ఆయన ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రావణ్‌బాబు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు పాటుపడాలని చెప్పారు. ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్, పాలిథీన్ వాడకాన్ని క్రమంగా తగ్గించాలని సూచించారు. ప్లాస్టిక్ వినియోగంతో అనేక అనర్థాలు తలెత్తుతున్నాయన్నారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని వెల్లడించారు. వైద్య ఆరోగ్య శాఖ ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో జిల్లా వ్యాధినిరోధక టీకాల అధికారి డాక్టర్ సుబ్బరాజు, డాక్టర్ గిరిధర్, డెమో జయప్రసాద్, డెప్యూటీ డెమో ఎన్.వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్లాస్టిక్ అనర్థాలపై కళాజాత ప్రదర్శన

గ్లోబల్ ఎన్విరాన్మెంటల్ స్టూడెంట్ ఎవేర్‌నెస్ ఆర్గనైజేషన్ కళాకారుల బృందం సోమవారం ప్లాస్టిక్ వినియోగంపై కలిగే అనర్థాల వివరిస్తూ నగరంలోని పలు ప్రాంతాల్లో కళాజాతా ప్రదర్శన నిర్వహించింది. ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో జూన్ 1 నుంచి కళాజాత కార్యక్రమాలు జరుగుతున్నాయి. నేటి యాంత్రిక జీవనంలో జీవన విధానాన్ని మెరుగుపరుచుకునేందుకు పాటించాల్సిన సూత్రాలు, పర్యావరణ పరిరక్షణ తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు వివరించారు.

పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలి

గుంటూరు ఎడ్యుకేషన్: పర్యావరణ పరిరక్షణలో విద్యార్థులు భాగస్వాములు కావాలని పాటిబండ్ల సీతారామయ్య సీబీఎస్ఈ పాఠశాల కరస్పాండెంట్ పాటిబండ్ల విష్ణువర్ధన్ పేర్కొన్నారు. సోమవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా లక్ష్మీపురం మెయిన్ రోడ్డులోని పాఠశాల ప్రాంగణంలో విద్యార్థులతో కలసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా విష్ణువర్ధన్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ అనేది నినాదానికి పరిమితం కాకుండా ప్రతి విద్యార్థి, ఉపాధ్యాయుడు నిజ జీవితంలో ఒక ఉద్యమంగా ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యక్షుడు డాక్టర్ సూర్యదేవర హనుమంతరావు, పాలకవర్గ సభ్యుడు గింజుపల్లి వరప్రసాదరావు, అకడమిక్ డైరెక్టర్ లేళ్ల కృష్ణవేణి, ప్రిన్సిపాల్ జంపని పద్మజ, ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బంది పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ బాధ్యత

ఏఎన్‌యూ : పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరూ బాధ్యతగా భావించాలని వీసీ ఆచార్య పి. రాజశేఖర్ తెలిపారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఎన్విరాన్‌మెంటల్ కౌన్సిల్, సీఎస్ఆర్, ఏఎన్‌యూ ఎల్‌ఎస్‌ఎఫ్ యూత్ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం యూనివర్సిటీలో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని నిర్వహించారు. వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన వీసీ మాట్లాడుతూ యూనివర్సిటీలో ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ వాడకం నిర్మూలనపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని సూచించారు. పర్యావరణ పరిరక్షణకు ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న కార్యాచరణకు అనుగుణంగా ఏఎన్‌యూలో కూడా ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య పి. వరప్రసాదమూర్తి, ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్ ఆచార్య సంధ్యాకోల్, సీడీసీ డీన్ ఆచార్య కె. మధుబాబు, ప్రిన్సిపాల్స్ ఆచార్య పి. సిద్ధయ్య, ఆచార్య శ్రీనివాసరెడ్డి, సీఎస్ఆర్ కో–ఆర్డినేటర్ ఆచార సరస్వతీరాజు అయ్యర్, దూర విద్యా కేంద్రం కో–ఆర్డినేటర్ డాక్టర్ బి. నాగరాజు, అడ్మిషన్ల డైరెక్టర్ డాక్టర్ జి. అనిత, ర్యాకుల కో–ఆర్డినేటర్ డాక్టర్ భవనం నాగకిశోర్, డాక్టర్ గోపీకృష్ణ పాల్గొన్నారు.



అనాథ ఆశ్రమంలో చిన్నారికి దుప్పట్లు పంపిణీ చేస్తున్న డీఆర్‌ఎం రామకృష్ణ , ఆయన సతీమణి

విస్తృతంగా చెట్లను పెంచాలి

గుంటూరు ఎడ్యుకేషన్: భూ తాపాన్ని నివారించేందుకు విస్తృతంగా చెట్లను పెంచాలని గుంటూరు చలమయ్య-కర్పూరపు వెంకట నారాయణ డిగ్రీ కళాశాల కార్యదర్శి కర్పూరపు రామకృష్ణ ప్రభు పేర్కొన్నారు. సంగడిగుంటలోని కళాశాలలో సోమవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా రామకృష్ణ ప్రభు మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రస్తుత వేసవిలో విపరీతమైన ఎండలు, వేడి గాలుల్ని చూస్తున్నామని పేర్కొన్నారు. చెట్ల నరికివేతతో భూమిపై ఉష్ణోగ్రతలు పెరిగిపోతున్నాయని తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ మహంకాళి శ్రీనివాసరావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

టీజేపీఎస్ కళాశాలలో మొక్కలు నాటిన విద్యార్థులు

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా సోమవారం పట్టాభిపురంలోని టీజేపీఎస్ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో ప్రిన్సిపాల్ ఏబీపీ మనోహర్ విద్యార్థులతో కలసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో కళాశాల ఎన్ఎస్ఎస్ అధికారి జె.వి. సుధీర్‌కుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.



మొక్క నాటుతున్న రామకృష్ణప్రభు శ్రీనివాసరావు, అధ్యాపకులు



టీజేపీఎస్ కళాశాలలో మొక్కలు నాటిన విద్యార్థులతో ప్రిన్సిపాల్ మనోహర్, అధ్యాపకులు



విద్యార్థులతో మొక్కలు నాటిస్తున్న విష్ణువర్ధన్, వరప్రసాదరావు తదితరులు

డీఆర్‌ఎం కార్యాలయంలో వేడుకలు

లక్ష్మీపురం: గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలోని రైల్వేస్టేషన్లు, కార్యాలయాల ప్రాంగణాల్లో పర్యావరణ పరిరక్షణలో భాగంగా పచ్చని చెట్లు నాటి ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించాలని డీఆర్‌ఎం ఎం.రామకృష్ణ సూచించారు. పట్టాభిపురంలోని డీఆర్‌ఎం కార్యాలయంలో సోమవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా కోరమండల్ ఎక్స్‌ప్రెస్ రైలు ప్రమాదంలో మృతి చెందిన వారికి నివాళులర్పించారు. అనంతరం డీఆర్‌ఎం మాట్లాడుతూ కాలుష్యరహిత వాతావరణంలో జీవనం సాగించడం వల్ల రోగాలు చెంతకు చేరవని చెప్పారు. అనంతరం పట్టాభిపురంలోని మాతృశ్రీ అనాథాశ్రమం, అనురాగ్ వృద్ధాశ్రమం, జేఎంజే సామాజిక సేవా కేంద్రాల్లో సీనియర్ సిటిజన్లకు దుప్పట్లు, పుస్తకాలు, బియ్యం, కిరాణ సామగ్రి, బెడ్‌షీట్, టవల్స్, బిస్కెట్లను డీఆర్‌ఎం ఎం. రామకృష్ణ, ఆయన సతీమణీ, సౌత్ సెంట్రల్ రైల్వే ఉమెన్స్ వర్కింగ్ ఆర్గనైజేషన్ అధ్యక్షురాలు ఆషాలత అందజేశారు. డివిజన్ అధికారులు పాల్గొన్నారు.

అర్హులైన న్యాయవాదులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

గుంటూరు లీగల్: అర్హులైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, కాపు, మైనార్టీ న్యాయవాదులకు రాజధాని ప్రాంతంలో ఇళ్ల స్థలాలు ఇవ్వాలని ఎస్సీ, ఎస్టీ, బీసీ, కాపు, మైనార్టీ న్యాయవాదుల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పుసులూరి జీవ కోరారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, కాపు, మైనార్టీ న్యాయవాదుల సమావేశం జీబీఏ నూతన భవనం ఎదురుగా ఉన్న పీపీల చాంబర్‌లో సోమవారం నిర్వహించారు. కార్యక్రమానికి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాజీ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న జీవ మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన వివిధ పథకాలతో రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలకు మేలు జరుగుతోందని తెలిపారు. ప్రాక్టీస్‌లో జూనియర్ న్యాయవాదులు రాణించేందుకు లా నేస్తం పథకం ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. వచ్చే ఎన్నికల్లో జగన్‌ను మళ్లీ సీఎంను చేసుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని చెప్పారు. కార్యక్రమంలో అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు సీహెచ్.వి.సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు సుద్దకట్టు అంజయ్య, రాష్ట్ర మహిళా కార్యదర్శి చైతన్య, జిల్లా కార్యదర్శి మాతంగి మాధవి, ఎస్సీ, ఎస్టీ, బీసీ, కాపు, మైనార్టీ న్యాయవాదులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పుసులూరి జీవ

మదర్సాలో ఏర్పాట్లను పరిశీలించిన డెప్యూటీ సీఎం

ఏఎన్‌యూ: పెదకాకాని మండలం నంబూరు గ్రామ పరిధిలోని మదరస ఏ– సిరాజుల్– ఉలుమాలో జరగనున్న ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి పర్యటన ఏర్పాట్లను సోమవారం డెప్యూటీ సీఎం అంజాద్ బాషా, గుంటూరు తూర్పు ఎమ్మెల్యే షేక్ మహ్మద్ ముస్తాఫా పరిశీలించారు. హజ్ క్యాంప్‌ను సీఎం సందర్శిస్తున్నందున అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని అధికారులకు డెప్యూటీ సీఎం సూచించారు. ప్రాంగణంలో చేపట్టాల్సిన చర్యలపై పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర మైనార్టీ నాయకులు, వక్ఫ్ బోర్డు అధికారులు, ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న డెప్యూటీ సీఎం అంజాద్ బాషా, ఎమ్మెల్యే ముస్తాఫా తదితరులు

ఫిర్యాదుల్ని సత్వరం పరిష్కరించండి

అధికారులకు అదనపు కమిషనర్ పెద్ది రోజా ఆదేశం

నెహ్రూనగర్: సమస్యలపై ప్రజల నుంచి అందే ఫిర్యాదుల్ని నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ పెద్ది రోజా విభాగాధిపతులకు స్పష్టం చేశారు. నగరపాలక సంస్థ కాన్ఫరెన్స్ హాలులో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఆమె ప్రజల నుంచి ఫిర్యాదుల్ని స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజల నుంచి అందే ఫిర్యాదుల పరిష్కారంపై బాధ్యతతో వ్యవహరించాలని చెప్పారు. 'జగనన్నకు చెబుదాం'కు అందే అర్జీల పరిష్కారానికి విభాగాధిపతే బాధ్యత తీసుకోవాలని తెలిపారు. ఫిర్యాదు పరిష్కారం అనంతరం ఫిర్యాదికి సమాచారం తెలియజేయాలని ఆదేశించారు.

ప్రజల నుంచి 28 ఫిర్యాదులు

సోమవారం నిర్వహించిన స్పందనలో 28 ఫిర్యాదులు అందాయని అదనపు కమిషనర్ తెలిపారు. ఇందులో పట్టణ ప్రణాళిక విభాగానికి– 8, ఇంజినీరింగ్ విభాగానికి– 8, ప్రజారోగ్య విభాగానికి– 5, రెవెన్యూ విభాగానికి– 5, ఉపా సెల్ విభాగానికి– 1, అకౌంట్స్ విభాగానికి –1 చొప్పున ఉన్నాయి. ఫిర్యాదుల్ని నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని అధికారుల్ని ఆమె ఆదేశించారు. కార్యక్రమంలో డెప్యూటీ కమిషనర్లు బి.శ్రీనివాసరావు, టి.వెంకట కృష్ణయ్య, ఎస్ఈ భాస్కర్, సిటీప్లానర్ ప్రదీప్ కుమార్, సీఎంహెచ్ డాక్టర్ విజయలక్ష్మి, ఎంహెచ్‌వో డాక్టర్ భాను ప్రకాష్, మేనేజర్ శివన్నారాయణ, ఉపా సెల్ సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు, డెప్యూటీ సిటీప్లానర్లు, ఏసీపీలు, ఈఈలు, ఎస్ఎస్‌లు, సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.



ప్రజల నుంచి ఫిర్యాదుల స్వీకరిస్తున్న అదనపు కమిషనర్

బదిలీలు, ఉద్యోగోన్నతుల్లో ఖాళీల్ని బ్లాక్ చేయరాదు

గుంటూరు ఎడ్యుకేషన్: ఉపాధ్యాయ బదిలీలు, ఉద్యోగోన్నతుల్లో ఖాళీల్ని బ్లాక్ చేయరాదని డీఈవో పి.శైలజకు ఎస్టీయూ గుంటూరు, పల్నాడు జిల్లాల అధ్యక్షులు గేరా మోహనరావు, డి. పెదబాబు విజ్ఞప్తి చేశారు. ఈమేరకు సోమవారం డీఈవో కార్యాలయంలో శైలజను కలసి వినతి పత్రం సమర్పించారు. బదిలీలు, ఉద్యోగోన్నతుల్ని అత్యంత పారదర్శకంగా నిర్వహించాలని వారు కోరారు. సీనియారిటీ జాబితాల్లో అసంబద్ధతను తొలగించి, సాంకేతిక సమస్యల్ని పరిష్కరించి ఉపాధ్యాయ బదిలీల్ని సమర్థంగా కొనసాగించాలని తెలిపారు. ప్రాధాన్యతాక్రమంలో అర్హులకు న్యాయం చేసి, అనర్హుల్ని తొలగించాలని పేర్కొన్నారు. బదిలీలు, ఉపాధ్యాయుల అభ్యంతరాల పరిష్కారానికి జిల్లాస్థాయిలో గ్రీవెన్స్ కొనసాగించాలని కోరారు. వినతిపత్రం సమర్పించిన వారిలో సంఘ నాయకులు సీహెచ్. నరసింహారావు ఉన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

పట్నంబజారు: అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అరండల్‌పేట పరిధి కొరిటిపాడు వినాయకనగర్‌లోని 16 నంబరు రేషన్ షాపు నుంచి 57 బస్తాల రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న నేపథ్యంలో పక్కా సమాచారంతో పోలీసులు కొరిటిపాడు వద్ద ఆటోను నిలిపి బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. మిరియాల వీరయ్య, ఆటో డ్రైవర్ అంజయ్యలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

నగరంపాలెంలో....

నగరంపాలెం పోలీసు స్టేషన్ పరిధిలోని చుట్టుగుంట ప్రాంతంలో సోమవారం ఉదయం రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. పోలీసు తనిఖీల్లో భాగంగా ఆటోను పరిశీలించగా, సిరిపురం గ్రామానికి చెందిన యు. కొండలు 150 కిలోల రేషన్ బియ్యం తరలిస్తున్నట్లు గుర్తించి నిందితుడ్ని అదుపులోకి తీసుకుని బియ్యం స్వాధీనం చేసుకున్నారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

యూటీఎఫ్ కార్యాలయంలో వెబ్ ఆప్షన్ల నమోదు

గుంటూరు ఎడ్యుకేషన్: ఉపాధ్యాయ బదిలీల ప్రక్రియలో భాగంగా ఆన్‌లైన్‌లో ఆప్షన్లు నమోదు చేసుకునేందుకు ఉపాధ్యాయులకు సహాయకారిగా సోమవారం బ్రాడీపేటలోని యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో వెబ్ ఆప్షన్ల నమోదు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.ఆదిలక్ష్మి, ఎం. కళాధర్ మాట్లాడుతూ ఈనెల 8వ తేదీ వరకు ప్రతిరోజు ఉదయం 9.00 గంటల నుంచి రాత్రి 9.00 గంటల వరకు నమోదు ప్రక్రియ కొనసాగుతుందని, బదిలీలకు దరఖాస్తు చేసిన ఉపాధ్యాయులు ఆన్‌లైన్‌లో ఆప్షన్లు నమోదు చేసుకునే సదుపాయాన్ని వినియోగించుకోవాలని సూచించారు. నమోదు కోసం వచ్చేవారు ముందుగా ఖాళీలను ఒక ఆర్డర్‌లో రాసుకుని, చివరి తేదీ వరకు వేచి చూడకుండా నమోదు చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర ప్రచురణల కమిటీ చైర్మన్ ఎం. హనుమంతరావు, జిల్లా సహాధ్యక్షుడు జి. వెంకటేశ్వర్లు, కార్యదర్శులు షకీలాబేగం, నాయకులు జి. వెంకటేశ్వరరావు, ఆంజనేయులు, ఎం. గురుబ్రహ్మం, పి. ప్రేమ్‌కుమార్, కె. విజయభాస్కర్, కె. రాంబాబు, శ్రీరామ్‌మూర్తి తదితరులు పాల్గొన్నారు.



వెబ్ ఆప్షన్ల నమోదు కేంద్రాన్ని ప్రారంభించిన యూటీఎఫ్ నాయకులు

11న ఆచార్య హరిబాబుకు అవార్డు ప్రదానం

పాత గుంటూరు: బృందావన్ గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలోని అన్నమయ్య కళావేదికపై విద్యా ప్రదాత సీహెచ్. సాంబయ్య వర్ధంతి పురస్కరించుకుని 11న ఒంగోలు ఆంధ్రకేసరి యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య బి. హరిబాబుకు సాంబయ్య స్మారక అవార్డు ప్రదానం చేస్తున్నట్లు ఆత్మీయ ఆర్ట్ థియేటర్ వ్యవస్థాపకులు సీహెచ్. భాస్కరరావు ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 6 గంటలకు ప్రారంభమయ్యే సభ అనంతరం 'ఎడారిలో వాన చినుకు' నాటిక ప్రదర్శించనున్నట్లు తెలిపారు.

హెడ్ కానిస్టేబుల్ కుటుంబానికి ఆర్థిక సాయం

నగరంపాలెం: మంగళగిరి పట్టణ పీఎస్ హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసరావు రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందారు. గుంటూరు జిల్లా పోలీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చేయూత ద్వారా లక్ష రూపాయిల చెక్కుని శ్రీనివాసరావు భార్యకు డీపీఓలో జిల్లా ఎస్పీ కె.ఆరిఫ్ హఫీజ్ అందించారు.